



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక :20 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం సోమవారం 2 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 20 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM MON 2 FEBRUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## రూ.53.5 లక్షల కోట్లతో
# కేంద్ర బడ్జెట్

- 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.53.5 లక్షల కోట్ల బడ్జెట్
- మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు
- వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు
- ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం



**రెవెన్యూ వసూళ్లలో 35,33,150 కోట్లు**
**మూలధన వసూళ్లలో 18,14,165 కోట్లు**

### కేంద్ర బడ్జెట్ ఎఫెక్ట్: ధరలు పెరిగేవి, తగ్గేవి

- కొన్ని రకాల ఔషధాలు, ఈవీ బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్ ధరల్లో తగ్గుదల
- విదేశీ విద్య, వైద్యపరికరాలపై తగ్గనున్న భారం
- పెరగనున్న సిగరెట్, లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు

- మిగతా2లో

### హైదరాబాద్ 3 హైస్పీడ్ రైళ్లు!

- ఏపీ సహా 4 రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ కోసం పథకం, హైదరాబాద్ సహా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు
- సహజ వనరులన్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి
- మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ సహా వివిధ నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లు



## ఏపీ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఒక వరం...
# ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్



- హైస్పీడ్ రైల్ కారిడార్లు, డేటా సెంటర్ల ఏర్పాటు రాష్ట్రానికి మేలు చేస్తుందని వెల్లడి
- టెక్నాలజీ, పరిశ్రమలు, పర్యాటక రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించిందన్న సీఎం
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు కేంద్ర బడ్జెట్ సహకరించేలా ఉందని హర్షం
- 2047 నాటి వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని ప్రశంస

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఈ బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. కుప్పంలో ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు

- మిగతా2లో

## బడ్జెట్ లో ఏపీకి వచ్చింది
# గుండు సున్నా



- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శ
- ఎన్డీయేలో చంద్రబాబు కీలక పాత్రలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరలేదని ఆరోపణ
- అమరావతికి నిధులు ఇవ్వకుండా అప్పులు అంటగట్టడం దుర్మార్గమని వ్యాఖ్య
- పోలవరం ప్రాజెక్టుకు నిధులు తగ్గించి, ఎత్తు తగ్గించే కుట్ర చేస్తున్నారని ఫైర్

విభజన హామీలు, ప్రత్యేక హోదాను కేంద్రం పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం

- మిగతా2లో

## మాజీ మంత్రి జోగి రమేష్
# ఇంటికి నిప్పు...
### రాళ్లు కర్రలతో టీడీపీ కార్యకర్తల దాడి



- ఇబ్రహీంపట్నంలో హైటెన్షన్.. జోగి రమేశ్ ఇంటికి నిప్పు
- మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడి
- విజయవాడ ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం
- నివాసానికి నిప్పు పెట్టి, ఫ్లెక్సీలను తగులబెట్టిన ఆందోళనకారులు
- చంద్రబాబు, లోకేశ్‌పై వ్యాఖ్యలకు నిరసనగా ఈ ఘటన
- భారీగా మోహరించిన పోలీసులు, పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం

- మిగతా2లో

పెన్ పవర్ డెస్క్:విజయవాడ సమీపంలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ నివాసాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముట్టడించాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయానక వాతావరణం ఏర్పడింది.టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీడీపీ



## టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ... రవిచంద్రకు బాధ్యతలు

- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు
- సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్రకు అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

- మిగతా2లో

## అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదు



పెన్ పవర్ డెస్క్:ఇరాన్– అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలోని

- మిగతా2లో

## కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్..
# వాస్తవాలను విస్మరించారన్న రాహుల్



- నిరుద్యోగం, రైతుల కష్టాలను ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ ఆరోపణ
- స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమన్న అఖిలేశ్ యాదవ్
- ఇది కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని విమర్శ
- మధ్యతరగతి, రైతులు, కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ

- మిగతా2లో

## పనిచేసే వారికి పట్టం.. మారకుంటే నమస్కారం..
### కుప్పం నుంచి చంద్రబాబు స్ట్రాంగ్ మెసేజ్!

- కుప్పంలో కార్యకర్తలతో చంద్రబాబు సమావేశం
- నిజంగా కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసా
- పనితీరు బాగోకపోతే నిర్మోహమాటంగా పక్కన పెడతానని హెచ్చరిక
- కుప్పం మోడల్‌నే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- ఒకే సీజన్‌లో కుప్పానికి హంద్రీ–నీవా జలాలు తెచ్చామని వెల్లడి
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపించామని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# చేతులు కాలాక.. అంబటి పశ్చాత్తాపం.. ఇప్పుడేం లాభం?

రాజకీయాల్లో మాట ఒక పదునైన ఆయుధం. దాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వాడితే గౌరవం.. వ్యక్తిగత దూషణలకు ఉపయోగిస్తే అగౌరవం దక్కుతాయి. తాజాగా వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యవహారశైలిని గమనిస్తే.. "చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం" అనే సామెత అక్షరాలా వర్తిస్తుందనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యల విషయంలో ఆయన వ్యక్తం చేస్తున్న 'పశ్చాత్తాపం' వెనుక నైతిక బాధ్యత ఉందా లేక కేవలం రాజకీయ రక్షణ ఉందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

**మాటల పదును.. మర్యాద హద్దులు**

ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది అభివృద్ధికి సోపానం కావాలి. కానీ దురదృష్టవశాత్తూ నేటి రాజకీయాల్లో విమర్శలు వ్యక్తిగత దూషణలుగా.. అసభ్యకర వ్యాఖ్యలుగా రూపాంతరం చెందుతున్నాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తిపై మాట్లాడేటప్పుడు కనీస మర్యాద పాటించకపోవడం ప్రజాప్రతినిధుల సంస్కారానికే ప్రశ్నార్థకంగా మారుతుంది. తప్పు జరిగిపోయిన తర్వాత "అలా అనకుండా ఉండాల్సింది" అని చెప్పడం బాధ్యత నుంచి తప్పించుకోవడమే తప్ప, తప్పును సరిదిద్దుకోవడం కాదు.

**పశ్చాత్తాపమా? ఆత్మరక్షణనా?**

టీడీపీ కార్యకర్తలపై చేసిన వ్యాఖ్యలు తప్పేనని అంగీకరిస్తూనే మరోవైపు "అరెస్టులకు భయపడను", "చట్టం నాకు తెలుసు" అంటూ న్యాయపరమైన ధైర్యాన్ని ప్రదర్శించడం చూస్తుంటే.. అక్కడ అంబటి రాంబాబు పశ్చాత్తాపం కంటే ఆత్మరక్షణే ఎక్కువగా కనిపిస్తోంది. నిజమైన పశ్చాత్తాపం వ్యక్తిగత అహంకారాన్ని తగ్గించాలి.. కానీ అంబటి మాటల్లో ఆ సంకేతాలు మృగ్యమయ్యాయి. పోలీసుల చర్యలను తప్పుబట్టడం, అధికార పార్టీ నేతల పేర్లను ప్రస్తావించడం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించడానికి బదులు, రాజకీయ సెగను మరింత రాజేసే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**ప్రజాస్వామ్యానికి నష్టం**

రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలు కేవలం వారి వ్యక్తిగతమైనవి కావు. అవి సమాజంపై, ముఖ్యంగా కేడర్లపై తీవ్ర ప్రభావం చూపుతాయి. నేతలు హద్దులు దాటితే కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ఘర్షణలకు దిగుతారు. ఇది అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ మాటలకు కట్టుబడి ఉండాలి. తప్పు జరిగినప్పుడు సాకులు వెతకడం కంటే నిష్కపటమైన క్షమాపణ కోరడం వల్లనే నాయకత్వానికి గౌరవం పెరుగుతుంది. పశ్చాత్తాపం అనేది కేవలం పెదాల మీద నుంచి వచ్చే మాట కాదు... అది ప్రవర్తనలో కనిపించే మార్పు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకున్నప్పుడే ఆ మాటలకు విలువ ఉంటుంది. లేదంటే చేతులు కాలాక చేసే పశ్చాత్తాపం కేవలం కాలక్షేపానికో, చట్టం నుంచి తప్పించుకోవడానికో చేసే 'రాజకీయ విన్యాసం'గానే మిగిలిపోతుంది. రాజకీయాల్లో హుందాతనం పెరగాలంటే నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

**అరెస్ట్ లపై అంబటి భార్య హైకోర్టుకు..**

అంబటి వ్యాఖ్యలపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడంతో అంబటి రాంబాబు సతీమణి విజయలక్ష్మి ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తమకు సరైన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని, అక్రమ నిర్బంధాలు జరిగాయని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. 24 గంటల భద్రత కల్పించాలని కోర్టును కోరారు. అంబటి రాంబాబు పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అరెస్టులకు భయపడేది లేదని, సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై తన విమర్శలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ వ్యాప్తంగా హైటెన్షన్ వాతావరణం నెలకొనగా, గుంటూరులో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి నిప్పు...

- మొదటి పేజీ తరువాయి

కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. తొలుత ఇంటిపై రాళ్లతో దాడి చేసి, ఆ తర్వాత ఇంటికి నిప్పుపెట్టారు. ఇంటి చుట్టూ ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను కూడా దగ్ధం చేశారు. దాడి సమయంలో జోగి రమేశ్ ఇంట్లో లేరు. ఈ ఘటనలో ఇంటి మొదట అంతస్తులో మంటలు ఎగిసిపడ్డాయి.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని శాంతింపజేసేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే ఇంటికి మాత్రం తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదు

- మొదటి పేజీ తరువాయి

ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతిని రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు. స్థానిక మీడియాలో ప్రసారమైన వీడియోలో పెజెష్కియాన్ (మీఖంశీబస ూవఓవంష్ట్రనిఋఖఅ) మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, యూరప్ నేతలు మా సమస్యలను లక్ష్యంగా చేసుకున్నారు. మా ప్రజలను రెచ్చగొట్టి.. దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నించారు. ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. ఇరాన్‌లో జరిగిన ఆందోళనలు కేవలం సామాజిక నిరసనలు కావని అందరికీ తెలుసన్నారు. ఇక, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్‌సిసితో.. పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాతో తాము యుద్ధం కోరుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌కు గానీ, అమెరికాకు గానీ సంఘర్షణలు ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు.

**చర్చలకు వచ్చిన ఇరాన్: ట్రంప్**

మరోవైపు, ఇరాన్ తమతో చర్చలకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "వారు మాతో మాట్లాడుతున్నారు. ఏదైనా ఒప్పందం జరుగుతుందో లేదో చూడాలి. మొత్తంగా ఏం జరుగుతుందో చూద్దాం" అన్నారు. అయితే, అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నాయని పరోక్షంగా హెచ్చరికలు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా దాడి ప్రణాళికల గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్నారు.

# రూ.53.5 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు**

2026–27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025–26 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు.

**మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులు**

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హై–స్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబై–పుణె, పుణె–హైదరాబాద్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున డంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**రంగాల వారీగా నిధుల కేటాయింపు**

ఈ బడ్జెట్‌లో పలు కీలక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

**బయోఫార్మా:** బయోఫార్మా రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించారు. దీనికోసం రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించారు.

**ఎంఎస్ఎంఈ:** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**ఎలక్ట్రానిక్స్:** ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం కోసం కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు.

**పరిశ్రమలు:** కంటైనర్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి రూ.10,000 కోట్లు కేటాయించారు.

**పర్యావరణం:** కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీల కోసం రాబోయే ఐదేళ్లలో రూ.20,000 కోట్లు కేటాయించారు.

**పట్టణాభివృద్ధి:** నగర ఆర్థిక ప్రాంతాల (సిటీ ఎకనామిక్ రీజియన్స్) అభివృద్ధి కోసం ఒక్కో ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్లు కేటాయించనున్నారు.

**పన్నులు, ఇతర ప్రతిపాదనలు**

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు.

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

**హైదరాబాద్ సహా వివిధ నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లు**

ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 1. పుణే–హైదరాబాద్, 2. హైదరాబాద్–బెంగళూరు, 3. హైదరాబాద్–చెన్నై, 4. ముంబై–పుణే, 5. బెంగళూరు–చెన్నై, 6. ఢిల్లీ–వారణాసి, 7. వారణాసి–సిలిగురి కారిడార్లను ప్రకటించారు. వారణాసి, పాట్నాలలో షిప్ రిపేర్ కర్మాగారాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధికి పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. టెక్స్‌టైల్ రంగం కోసం 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని, ఈ రంగం కోసం వచ్చే ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. సూక్ష్మతరహా పరిశ్రమల కోసం రూ.2 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మూడు ఆయుర్వేద ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సులను తీసుకు రానున్నట్లు తెలిపారు.

## బడ్జెట్ లో ఏపీకి వచ్చింది గుండు సున్నా

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని, 50 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌లో ఏపీకి లభించింది గుండు సున్నా అని ఆమె విమర్శించారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రులను దగా చేసిన బడ్జెట్ అని, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కేంద్రం అణగదొక్కిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌పై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "విభజన హామీలలో ఒక్కదానికీ దిక్కులేదు. ప్రత్యేక హోదా ఊసే లేదు. వెనకబడిన ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. రాష్ట్ర జీవనాడి పోలవరానికి నిధులు కేటాయించకుండా జీవం తీశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కనికరం చూపలేదు, కడప స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూడలేదు. మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్ల ప్రస్తావనే లేదు" అని షర్మిల దుయ్యబట్టారు.

అమరావతి రాజధాని నిర్మాణంపై కేంద్రం తీరును ఆమె తప్పుబట్టారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించాలనుకున్న రాజధానికి కేవలం రూ.1,500 కోట్ల అప్పు ఇప్పిస్తామనడం దారుణమని అన్నారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత కాదా అని ప్రశ్నించారు. గతేడాది ఇస్తామన్న రూ.15 వేల కోట్ల అప్పు ఏమైందని నిలదీశారు. పోలవరం ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేవలం రూ.3 వేల కోట్లు కేటాయించడంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నట్లుగా ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్లకు పెంచే ప్రతిపాదనను కేంద్రం పట్టించుకోలేదని, కేవలం 41.15 మీటర్లకే పరిమితం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రూ.20 వేల కోట్ల పునరావాస ప్యాకేజీ కోసం ప్రాజెక్టును బలిపెడుతున్నారని, ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా పెద్దన్న పాత్ర పోషిస్తున్న చంద్రబాబు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం ఆయన పాలనా తీరుకు నిదర్శనమని విమర్శించారు.

## పనిచేసే వారికి పట్టం.. మారకుంటే నమస్కారం..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కుప్పంపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కుప్పంలో ఆదివారం నాడు నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను వెతుక్కుని వచ్చి గౌరవిస్తానని భరోసా ఇస్తూనే, పనితీరు మార్చుకోని నేతలకు గట్టి హెచ్చరికలు పంపారు. ఇదే సమావేశంలో, నాడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఉన్నత పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. "ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకున్నా పార్టీ జెండా మోసిన షణ్ముఖ రెడ్డికి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. నిన్నటి వరకు సామాన్య కార్యకర్తగా ఉన్న ఆయన, ఈరోజు పార్లమెంట్ అధ్యక్షుడయ్యారు. ఇదే తెలుగుదేశం పార్టీలో ఉండే గుర్తింపు" అని పేర్కొన్నారు. తన కష్టాన్ని గుర్తించినందుకు షణ్ముఖ రెడ్డి భావోద్వేగానికి గురై అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ని సంక్షోభాలు ఎదురైనా టీడీపీ నిలదొక్కుకోగలిగిందని, అందుకే ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనంతటి మెజారిటీని కూటమికి కట్టబెట్టారని చంద్రబాబు అన్నారు. వైసీపీ కనీసం ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందని, ప్రజలతో మమేకమైతేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. "నా రాజకీయ జీవితం 2028 నాటికి 50 ఏళ్లకు చేరుకుంటుంది. ప్రజల భవిష్యత్, వారి సంక్షేమం కోసమే నా ప్రతి ఆలోచన ఉంటుంది" అని తెలిపారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ, ఒకే సీజన్‌లో హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, లేదంటే ఈ ప్రాంతం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేదని గుర్తుచేశారు. "రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పాం.. చేసి చూపించాం. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉంది. దీనిని మరింత అభివృద్ధి చేస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి వంటి నగరాలు దేశానికి అవసరమని ఆర్థిక సర్వే కూడా చెప్పిందని గుర్తుచేశారు. తన పాలనా శైలిని వివరిస్తూ, "నేను నిర్మొహమాటంగా మాట్లాడతా, వాస్తవాలు చెబుతా. తప్పులు సరిచేసుకోమని సూచిస్తా. అప్పటికీ పనితీరు మార్చుకోకపోతే నమస్కారం పెట్టి పక్కన పెడతాను" అని గట్టిగా హెచ్చరించారు. ప్రతి వారం ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తున్నానని, కార్యకర్తలకు, తనకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా టెక్నాలజీని వినియోగిస్తున్నామని చెప్పారు. కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కుప్పంలోని 150 చెరువులను నింపినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాలని కోరారు.

## కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్..

- మొదటి పేజీ తరువాయి

ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు.ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. "ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు ఇతర విపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై పెదవివిరిచారు. వృద్ధిని పునరుద్ధరించడానికి, ఉపాధి కల్పించడానికి ఇందులో సరైన సంస్కరణలు లేవని విమర్శించారు.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరో అడుగు ముందుకేసి, స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమని ఆరోపించారు. "బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదిగో.. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తారా లేదా అన్నది ప్రశ్న కాదు, అది ఇంకా ఎంత పడిపోతుందన్నదే అసలు ప్రశ్న అని మేము ముందే చెప్పాం" అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని, కమీషన్లు దక్కించుకోవడానికి, బీజేపీ సొంత వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికే దీన్ని రూపొందించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. "ఇది బీజేపీ తరహా అవినీతికి కంటికి కనిపించని లెక్కల చిట్టా" అని అఖిలేష్ అభివర్ణించారు.

అనియంత్రితంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం సమయంలో పన్ను ఉపశమనం కల్పించకపోవడం 'పన్ను దోపిడీ' కిందకే వస్తుందని ఆయన విమర్శించారు. సంపన్నులకు వ్యాపారం, ప్రయాణాల కోసం పదుల రకాల మినహాయింపులు ఇచ్చి, నిరుద్యోగులకు మాత్రం 'ఆశల ఖాళీ పళ్లెం' చూపించారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్ వల్ల మధ్యతరగతి ప్రజలు పూర్తిగా మోసపోయినట్లు భావిస్తున్నారని, పేదలు మరింతగా కుంగిపోతున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులు టెలిస్కోప్‌తో వెతికినా తమ కోసం ఇందులో ఏమీ కనిపించలేదని, ఇది తీవ్ర నిరాశాజనకమైన, దారుణమైన బడ్జెట్ అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విజన్, మిషన్, దిశానిర్దేశం లేని బడ్జెట్ అని, పూర్తిగా అబద్ధాలతో నిండి ఉందని ఆమె అభివర్ణించారు.

ఢిల్లీ పర్యటనకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని ఆరోపించారు."ఈ బడ్జెట్‌కు ఎలాంటి లక్ష్యం లేదు. ఇది పూర్తిగా పేదలు, మహిళలు, రైతులు, యువత, సామాన్యులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకమైనది. విద్యా రంగానికి కేటాయింపులు లేవు. విద్యా సబ్సిడీ, సామాజిక భద్రతా సబ్సిడీ, ఎరువుల సబ్సిడీలను తగ్గించారు. ఇది పూర్తిగా అబద్ధాల కుప్ప" అని మమత తీవ్రంగా విమర్శించారు.

పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం ఒక్క పైసా కూడా కేటాయించలేదని ఆమె ఆరోపించారు. "మా రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదు. జీఎస్టీ రూపంలో మా డబ్బును వారే తీసుకెళ్లి, తిరిగి మేమే ఇస్తున్నట్టు గొప్పలు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని నడిపే నైతిక హక్కు వారికి లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు

## టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ... రవిచంద్రకు బాధ్యతలు

- మొదటి పేజీ తరువాయి

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేడు (ఫిబ్రవరి 1న) ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అనిల్ కుమార్ సింఘాల్‌ను తక్షణమే సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ సింఘాల్, 2017 మే నుంచి 2020 అక్టోబర్ వరకు తొలిసారి టీటీడీ ఈవోగా సేవలందించారు. అనంతరం గతేడాది సెప్టెంబరులో రెండోసారి ఈ పదవిని చేపట్టారు. కేవలం ఐదు నెలల కాలంలోనే ఆయన బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ నివేదిక వచ్చిన కొన్ని రోజుల్లోనే ఈ బదిలీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏపీ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఒక వరం... ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్

- మొదటి పేజీ తరువాయి

దోహదపడుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ బడ్జెట్ మరింత ఊతమిస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈల బలోపేతానికి తాము ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కేంద్రం 75 శాతం క్రెడిట్ గ్యారెంటీ ఇవ్వడం, రాష్ట్రం తరఫున మరో 20 శాతం అందిస్తుండటంతో ఈ రంగానికి భరోసా లభిస్తుందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత సాధికారత సాధించేలా ఈ బడ్జెట్ ఉందని, ఇది 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. ఆర్థిక మంత్రి సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, దేశానికి సరైన దిశానిర్దేశం చేసేలా ఉందని కొనియాడారు.

**రవాణా, టెక్నాలజీ రంగాలకు పెద్దపీట**

ఈ బడ్జెట్‌లో ప్రకటించిన మూడు కీలకమైన హైస్పీడ్ రైల్ కారిడార్లు (హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, బెంగళూరు–చెన్నై) ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా అమరావతి, తిరుపతి, పలమనేరు, చిత్తూరు వంటి కీలక ప్రాంతాలు అనుసంధానమవుతాయని తెలిపారు.

అలాగే, రాష్ట్రంలో ఉన్న 'రేర్ ఎర్త్ కారిడార్' ద్వారా విలువైన ఖనిజాలను వెలికితీసి, క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి మార్గం సుగమం అవుతుందన్నారు. ఐఎస్ఎం 2.0 కింద సెమీకండక్టర్ల కోసం రూ.40 వేల కోట్లు, టెక్స్‌టైల్ రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపులు ఇవ్వడం ఒక చారిత్రక నిర్ణయమని చంద్రబాబు అన్నారు. దీనివల్ల భారత్ గ్లోబల్ డేటా హబ్‌గా మారుతుందని, ఇప్పటికే విశాఖకు గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ డేటా సెంటర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధికి ఊతమిచ్చి, భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో బిల్ గేట్స్ కూడా అమరావతిలో పర్యటించనున్నారని, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి నెక్స్ట్ జెన్ టెక్నాలజీలకు ఏపీ చిరునామాగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**పర్యాటకం, వ్యవసాయ రంగాలకు ఊతం**

కేంద్ర బడ్జెట్‌లో అరకు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశాన్ని చేర్చడం హర్షణీయమని సీఎం అన్నారు. దీంతోపాటు పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించడం వల్ల ఫ్లెమింగో వంటి అరుదైన పక్షుల సంరక్షణకు, పర్యాటక వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈస్ట్ కోస్ట్ కారిడార్, అంతర్గత జలరవాణాకు నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

కొబ్బరి, జీడి, కోకో, చందనం వంటి ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా రాయలసీమను ప్రపంచంలోనే అత్యుత్తమ హార్టికల్చర్ క్లస్టర్‌గా తీర్చిదిద్దుతామని, 'పూర్వోదయ' పథకం నిధులు ఇందుకు దోహదపడతాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు ఈ ఏడాది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, ఇది బయోసైన్స్‌లో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని చంద్రబాబు తెలిపారు. 2019–24 మధ్య వారసత్వంగా వచ్చిన సమస్యలను పరిష్కరించుకుంటూ, కేంద్ర బడ్జెట్ అందించిన అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# శ్రీ స్వామివారిని దర్శించుకున్న ప్రముఖ దర్శకుడు గోపీచంద్ మలినేని




**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 1** :విశాఖపట్నంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాస్ మరియు కమర్షియల్ చిత్రాలకు చిరునామాగా నిలిచిన గోపీచంద్ మలినేని ఆదివారం భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకున్న దర్శకుడు గోపీచంద్ మలినేనికి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, అంతరాలయంలో సింహాద్రి అప్పన్నను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు గోపీచంద్ మలినేనికి వేద మంత్రోచ్చారణలతో వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి తీర్థప్రసాదాలను ఆయనకు అందజేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు గోపీచంద్ మలినేని మాట్లాడుతూ, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారి దర్శనం మనసుకు ఎంతో శాంతిని, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగిస్తుందని తెలిపారు. స్వామివారి కృపతో తన సినీ ప్రయాణం మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. దర్శకుడి దర్శనంతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. పలువురు భక్తులు, అభిమానులు ఆయనతో ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# “రాజా“ఇది మీకు “మామూలే“నా !











- అనధికార ‘కబేలాలు‘ పరిసరాలలో పశువుల వ్యర్థాలు
- పట్టుబడితే చాలు చలానాలతో సరిపెడతారు
- అధికారులు మారుతున్న మారని వ్యవస్థ -- కొందరివలన అందరికీ ఇబ్బందులే
- తెలిసి తెలియనట్టు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న “జీవీఎంసీ అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్“


m-Governance
Greater Visakhapatnam Municipal Corporation
Today my Activities
Name :sk munna
Mobile No :6304954646
emailId :
Penalty Amount :5000.00
Zone :ZONE3
Ward :WARD13
Area :1086006
Location :Arilova last busstop
Remarks :Beef waste material dumped at open point at arilova
Activity Name :Littering
Charge Name :Littering
VIEW
ActRefNo :SWMSPOTFN20260130_0003
Name :sk munna
Mobile No :6304954646
emailId :
Penalty Amount :5000.00
Zone :ZONE3
Ward :WARD13
Area :1086006
Location :Arilova last bus stop
Remarks :Cattle waste material dumped at arilova last bus stop open areas
Activity Name :Littering






**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి1**:అనధికార కబేళాలు పశువుల వ్యర్థాలతో కలుషిత మవుతున్న మూడసర్లోవ రిజర్వాయర్ పరిసర ప్రాంతాలు,చూసి చూడనట్టు పట్టుబడితే చాలానాలతో సరిపెడుతున్న అధికారులు, ముడసర్లోవ పరిసర ప్రాంతాలలో నగరంలోగల ప్రముఖ హోటల్ నుండి తరలిస్తున్న వ్యర్థాలు, పశువుల వ్యర్థాలు, నిర్మాణాల వ్యర్థాలు ముడసర్లోవ పరిసర ప్రాంతంలో పడవేస్తున్నారు. అసలే నిర్మానుష్యం తెలిసిన వారు తప్పా ప్రాంతంలో జనసంచారం ఉండకపోవడంతో వీటిని తరలిస్తున్నారు. అప్పుడప్పుడు పత్రికలలో వస్తున్న వార్తలకు స్పందించిన అధికారులు తూ తూ మంత్రముగా చర్యలు చేపట్టడం పరిసర ప్రాంతాలను కొంతవరకు శుభ్రం చేయడం జరుగుతుంది తెల్లవారితే యధా ప్రకారం వ్యర్థాలను తరలిస్తున్నారు. భారీ వాహనాలు రాకపోకలకు స్టాపర్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని తొలగించడం వాటిని ఇనపతుక్కుగా అమివేస్తున్నారు. పశువుల మాంస విక్రయాలకు ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినప్పటికీ ఇళ్ల మధ్యలో పశువులను తీసుకుని వచ్చి వధించడం స్థానిక ప్రజల నుండి అభ్యంతరాలు వస్తున్నా అధికారులు స్పెషల్ డ్రైవ్ పేరిట షాపుల వద్దకు చేరి చలానాలు వేయడం పరిపాటిగా మారిపోయింది. పశువులను వధించేందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో ప్రభుత్వం అనుమతులతో కూడిన కబేలాను ఏర్పాటు చేయాలని,పశు మాంస విక్రయదారులు కోరుతున్నారు. పశు మాంసం విక్రయదారులపై మాటిమాటికి దాడులు నిర్వహించి చలానాలో రూపంలో వసూలు చేయడమే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని,వారు కోరుతున్నారు. పశువులను తరలించి వధించడం పై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులు తీరును తప్పుపడుతున్నారు. హాస్పిటల్ స్కూల్స్ ప్రార్థన మందిరాలు గల ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలలో పశువులను వధించడం వాటి వ్యర్థాలను తరలిస్తున్న వారిపై అధికారులు చర్యలు చేపట్టి చలానాలతో సరిపెట్టడం సరికాదని వాటిని అక్కడి నుండి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

# నిర్మలమ్మ బడ్జెట్ భేష్.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం ఫిబ్రవరి 1 :** వరుసగా తొమ్మిదవ సారి కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతులు, యువత మీద ప్రత్యేక దృష్టి పెడుతూ కూర్పు చేశారని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేంద్ర బడ్జెట్ పై ప్రసంశల జల్లు కురిపిస్తూ ప్రకటన విడుదల చేశారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గింపు జరగడం.. పౌర విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ లక్ష్యాలను మరింత వేగంగా చేరుకునేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. పౌర విమానాల విడిభాగాలపై పన్ను తగ్గించడంతో పాటు, తన శ్రీకాకుళం జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరి కోలుకునేలా తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అని అన్నారు.

ఈసారి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 202627 కేంద్ర బడ్జెట్, స్థిరమైన ఆర్థిక విధానంతో పాటు పెట్టుబడులు, సంస్కరణలపై బలమైన దృష్టి పెట్టడం ద్వారా, భారతదేశానికి మరింత ప్రగతిని, సుస్థిర అభివృద్ధిని తీసుకురాగలిగిందని రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం సామాన్యులను మరింత ఆకట్టుకుందని తెలిపారు. ఏడు నగరాల మధ్య హై స్పీడ్ కారిడార్లు, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ, డేటా సెంటర్ల ఏర్పాటుకు తోడ్పాటు అందివ్వడం.. ఇలా ప్రతీ అంశం ప్రగతిని సూచిస్తోందని అన్నారు.

ప్రస్తుత ప్రపంచ అస్థిరతల నడుమ కూడా, ప్రభుత్వం బలమైన స్థిరమైన ఆర్థిక విధానాన్ని పాటిస్తోందని, 202627 కి కేంద్ర పెట్టుబడులను గతంలో కంటే అధికంగా 12.2 లక్షల కోట్లకు పెంచడం ద్వారా ప్రభుత్వం తన విజన్ ను స్పష్టం చేసిందని అన్నారు. ఈ పెట్టుబడులు తన శాఖా పరిధిలోని పౌర విమానయానం, విమానాశ్రయాలతో పాటు రైల్వేలు, రహదారులు, పోర్టులు, లాజిస్టిక్స్, పట్టణ మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లపై ఉన్నాయని అన్నారు. ఇది ఉపాధి, పెట్టుబడులు, పెట్టుబడిదారు విశ్వాసానికి సహాయపడుతుందని స్పష్టం చేశారు. ప్రతీ జిల్లాలో బాలికల వసతి గృహం.. గొప్ప ఆలోచన అని అన్న రామ్మోహన్ నాయుడు.. బాలికా విద్య మరింత ఉన్నతంగా ప్రకాశిస్తుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ నిర్మలమ్మ పద్దులు ఉండటం, అందులో ఆంధ్రప్రదేశ్ కు సైతం సింహ భాగం కేటాయింపులు జరగడం ఆనందంగా ఉందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రధాన పంటగా ఉన్న కొబ్బరికి తోడ్పాటు అందించే విధంగా కొబ్బరి ప్రోత్సాహక పథకం.. ఉద్దాన ప్రాంతానికి మళ్ళీ పూర్వ వైభవాన్ని అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీడి పంటకు సైతం తోడ్పాటు అందించే విధంగా కేటాయింపులు ఉండటం శుభపరిణామం అని అన్నారు.




## యువతకు మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పించిన సీఐ.



**యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి.క్రీడల పట్ల ఆసక్తి చూపాలి.**

**వాలీబాల్ కిట్లు పంపిణీ చేసిన ఎల్విన్ పేట సిఐ,హరి.**

**కురుపాం. ఫిబ్రవరి 01 పెన్ పవర్.** యువత మాదక ద్రవ్యాలకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.ఎలివిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్,హరి.సూచించారు.కురుపాం మండలం గుజువాయి గ్రామంలో ఆదివారం నాడు మాదకద్రవ్యాలు,సైబర్ నేరాల పై యువత కు అవగాహన కల్పిచారు.ఈ మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్,హరి మాట్లాడుతూ.యువత మాదక ద్రవ్యాలకు చెడు అలవాటులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు,అలాగే బెట్టింగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ అపరిచితులకు వ్యక్తిగత సమాచారాలు ఎట్టి పరిస్థితుల్లో వివరాలు ఇవ్వకూడదని ఆయన అనేక అంశాలపై యువతి యువకులకు అవగాహన కలిగించారు.యువత చెడు వ్యసనాలను దూరం పెట్టి క్రీడల పట్ల ఆసక్తి కనపరచాలని సిఐ అన్నారు.అనంతరం యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నీలకంఠరావు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పాచిపెంట జెడ్పిహెచ్ స్కూల్ హెచ్ఎం సస్పెండ్

- విధుల పట్ల నిర్లక్ష్యం, పాఠశాల నిధులు దుర్వినియోగం
- ప్రభుత్వం చేపట్టిన ముస్తాబు గాలికి వదిలి వెయ్యడం
- ప్రభుత్వం అధిస్తున్న సమాగ్రిని వినియోగించకుండా వదిలేయ్యడం
- స్వచ్ఛత - పరిశుభ్రత పాఠశాలలో పాటించకుండా విస్మరించడం
- ఉపాధ్యాయులు ఆన్‌లైన్ హాజర్ పర్యవేక్షణ లేకపోవడం
- పై కారణాలతో హెచ్ఎంను సస్పెండ్ చేసిన డిఈఓ బ్రహ్మజీరావు.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ పార్వతీపురం పిబ్రవరి 1 :** జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు జనవరి 31న నిర్వహించిన పాచిపెంట పాఠశాల సందర్శన సందర్భంగా, జెడ్‌పీహెచ్ఎస్ పాచిపెంట పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు (గ్రేడ్2)గా పనిచేస్తున్న బి ఈశ్వరరావు తన ఆధీనంలో ఉన్న పాఠశాలలో తీవ్రమైన అవకతవకలు జరగడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నట్లు గమనించిన డిఈఓ ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావును సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. గత కొన్నాళ్ళుగా పాచిపెంట పాఠశాలలో నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు వచ్చిన సమాచారంతో పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మజీరావు పాచిపెంట పాఠశాలను శనివారం అకస్మాత్తుగా తనిఖీలు చేసారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలలో ముస్తాబు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా అమలు చేపట్టనప్పటికీ పాచిపెంట పాఠశాలలో సక్రమంగా అమలుకాకపోవడంతో పాటు పాఠశాల ముస్తాబు విషయంలో తరగతి గదుల శుభ్రత మరియు ఆకర్షణీయతపై ఉన్నతాధికారులు పదేపదే సూచనలు ఇచ్చినప్పటికీ, హెచ్ఎం ఈశ్వరరావు పాటించకపోవడం, పాఠశాల తరగతి గదుల్లో ఉపయోగించదగిన పాత ఫర్నిచర్‌ను బయటకు వేసి నిరుపయోగంగా చేయడం వలన ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం మరియు నష్టం వాటిల్లేలా చేసినట్లు గుర్తించారు. పాఠశాల యొక్క మరుగుదొడ్లలో పరిశుభ్రత పాటించకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రభుత్వం అవసరమైన సామగ్రిని సరఫరా చేసినప్పటికీ, వాటిని వినియోగించకుండా నిర్లక్ష్యంగా వదిలివేయ్యడం వలన దుర్గంధం వెలువడి, విద్యార్థుల ఆరోగ్యానికి హానికరమైన పరిస్థితి ఏర్పడటమే కాక పాఠశాల ఆవరణ మొత్తం ఎండిన ఆకులు, చెత్త కాగితాలతో నిండిపోయి పరిశుభ్రత పూర్తిగా లోపించి డిఈఓ తనిఖీలో దర్శనమిచ్చాయి. 202324 సంవత్సరంలో సరఫరా చేసిన ఐఎఫ్‌బీలు (×ఖీదీం) ఉపయోగించకుండా నిర్లక్ష్యంగా వదిలివేసి ఉండటంతో పాటు ప్రభుత్వం సరఫరా చేసిన గ్రీన్ చాక్ బోర్డులను తరగతి గదుల్లో వినియోగించకుండా వరండాలో మెట్ల కింద పడవేసి ఉండటం డిఈఓ దృష్టిలో పడ్డాయి. ఉపాధ్యాయుల హాజరును ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడంలో కూడా హెచ్ఎం ఈశ్వరరావు పూర్తిగా విఫలమైనట్లు తేలింది. దీంతో ప్రధానోపాధ్యాయుడు (గ్రేడ్2) బి.ఈశ్వరరావు యొక్క ప్రవర్తన విధుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని మరియు పాఠశాల పరిపాలనలో పూర్తిగా వైఫల్యాన్ని సూచిస్తున్నది. పై కారణాలతో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నియమావళి 1991 లోని నిబంధన 8(1) మరియు 8(2) ప్రకారం లభించిన అధికారాలను వినియోగించి, ప్రధానోపాధ్యాయుడు (గ్రేడ్2) బి ఈశ్వరరావు జెడ్‌పీహెచ్ఎస్ పాచిపెంట వారిని క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేసి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.



## అంబటి రాంబాబు వ్యాఖ్యలు సభ్య సమాజానికే సిగ్గుచేటు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, లావేరు. ఫిబ్రవరి 1:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు వైఖరిపై తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అంబటి రాంబాబు వాడిన భాష మానవత్వం ఉన్న ఏ వ్యక్తి కూడా మాట్లాడలేరని, అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. ఆయన వాడుతున్న భాష అసహ్యకరంగా ఉందని,ప్రజాస్వామ్య విలువలు తెలియని అంబటి రాంబాబు వంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటానికి అనర్హులని, ఇలాంటి వారిని సభ్య సమాజం చీకొట్టుతూ ఛీధరించుకుంటోందని కళా వెంకటరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటిని తక్షణమే కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నోరు అదుపులో లేని నేతల పట్ల చట్టం తన ప్రతాపాన్ని చూపాలని కోరారు. తప్పు చేసిన వారిని మందలించాల్సింది పోయి, అంబటిని పరామర్శించడానికి వెళ్లడం జగన్ మోహన్ రెడ్డి నైజానికి నిదర్శనమని కళా వెంకటరావు ఎద్దేవా చేశారు. జగన్ తన పార్టీ నేతలకు నేర్పుతున్న సంస్కృతి ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచక నేతలను ఎవరూ సహించరని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. సంస్కారం లేని మాటలు, వ్యక్తిత్వ హననమే వైకాపా విధానం. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. ఇలాంటి వారిని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కళా వెంకటరావు తెలిపారు.

## అంబటి రాంబాబు వ్యాఖ్యలపై మండిపడ్డ - చదరం తులసిరామ్



**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 01:**నలభై సంవత్సరాల అనుభవం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు పై రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు, ఈ క్రమంలో 86వ వార్డు కూర్మన్నపాలెంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వార్డ్ అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ నేతృత్వంలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మని తగలబెట్టి అనంతరం దువ్వాడ పోలీస్ స్టేషన్లో తెలుగుదేశం పార్టీ నాయకులందరూ కూడా ఆయనపై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు.

## అంబటిపై కేసు నమోదు చేయాలి

-నర్సీపట్నంలో టీడీపీ శ్రేణుల ఫిర్యాదు




**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 01) :**ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై మాజీమంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై నర్సీపట్నంలో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటీలోని టీడీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీగా వెళ్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ గఫూర్‌కు ఫిర్యాదు చేశారు. అంబటి రాంబాబుపై తక్షణమే కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ మహిళలను గౌరవించే సంస్కృతి వైసిపికి లేదని విమర్శించారు. సాక్షాత్తు ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి సొంత తల్లిని, చెల్లిని గౌరవించలేదని, ఇక ఆ పార్టీ నాయకులు మహిళలకు ఏం గౌరవం ఇస్తారని ప్రశ్నించారు. గతంలో జగన్ భార్య భారతి రెడ్డిపై సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే తక్షణమే కేసులు పెట్టి అరెస్టులు చేశారని, కానీ ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి తల్లిని కించపరుస్తూ మాట్లాడుతుంటే వైసిపి నేతలు సిగ్గులేకుండా సమర్ధించుకుంటున్నారని మండిపడ్డారు. పురాణాల కాలం నుంచి చూసినా మహిళలను కించపరిచిన వారెవరూ బాగుపడిన దాఖలాలు లేవని, వైసిపి పతనం ప్రారంభమైందని హెచ్చరించారు. మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు ఉండాలి కానీ, వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులపై నిందలు వేయడం ఆరోగ్యకరమైన రాజకీయం కాదని హితవు పలికారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి తల్లిని దూషించడం సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి గురించి ఆలోచించాలే తప్ప, ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజల్లో ఉద్రిక్తతలు రెచ్చగొట్టవద్దని వైసిపి నేతలకు సూచించారు. అంబటి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.


అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో అంబటి రాంబాబు డౌన్ డౌన్ అంటూ టీడీపీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, ఇంఛార్జు, టీడీపీ ముఖ్య నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చెట్టుపల్లిలో ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 01) :**నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో శ్రీపైడితల్లి అమ్మవారి పండుగ గ్రామ ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోపాడ సత్యప్రసాద్ దంపతుల సౌజన్యంతో మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి భరతనాట్యం కళాకారులను సన్మానించి, చెట్టుపల్లి గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండుగ సమయంలో అమ్మవారిని దర్శించుకోవడం అమ్మవారి అనుగ్రహం పొందడం నా అదృష్టమన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అని, సిరులు కురిపించే తల్లి పైడితల్లి అమ్మవారని చెట్టుపల్లి ప్రజల ఇష్ట దైవమని తెలియజేశారు. ఈ కార్యక్రమం గురించి జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ మా పూర్వీకుల కాలం నుండి ప్రతి పనిలోనూ ముందుగా అమ్మవారి ఆశీస్సులతోనే పని ప్రారంభిస్తామని, మరీ ముఖ్యంగా మాకు సహకరించినటువంటి కమిటీ సభ్యులకు ఉత్సవ కమిటీ మరియు ఆలయ కమిటీ వారికి ఇక్కడకు విచ్చేసిన జనసేన నాయకులకు పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరి ప్రార్థిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మోపాడ సత్యప్రసాద్ దంపతులు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగ వెంకట కృష్ణారావు, జనసేన జిల్లా సెక్రటరీలు అల్లాడ సురేష్ పంచాడ హరినాథ్, ఎర్రంశెట్టి పాపారావు, వైస్ ఎంపీపీ రత్నం, మోపాడ మురళి, మోపాడ ప్రసాద్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## యువకుడు అదృశ్యం




**ఆనందపురం, పెన్ పవర్,ఫిబ్రవరి 01:**ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే గొట్టిపల్లి పంచాయతీ చిమలమెట్టపాలెం గ్రామానికి చెందిన బోడసింగి వెంకటలక్ష్మి కుటుంబంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆమెకు ఇద్దరు సంతానం ఉండగా, పెద్ద కుమారుడు బోడసింగి వినయ్ (20) కొమ్మది గాయత్రీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు.

జనవరి 29న ఉదయం సుమారు 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి అన్నవరం దేవాలయానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన వినయ్, ఆ తరువాత ఇంటికి తిరిగి రాలేదు. మధ్యాహ్నం తల్లి ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్‌గా రావడంతో అనుమానం కలిగింది. అతని స్నేహితులు, బంధువులను అడిగి తెలుసుకున్నా ఎలాంటి సమాచారం లభించలేదు.

ఆ రోజు నుంచి కుటుంబ సభ్యులు స్వయంగా వెతికినా వినయ్ ఆచూకీ దొరకకపోవడంతో, తల్లి వెంకటలక్ష్మి ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సర్కిల్ ఇన్స్పెక్టర్ సి హెచ్ వాసు నాయుడు మిస్సింగ్ కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కోసం ఎఎస్‌ఐ బలంనాయుడుకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు

## బిసివై పార్టీ అల్లూరి జిల్లా కన్వీనర్‌గా కిల్లో రాజన్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి1:** భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్‌గా న్యాయవాది కిల్లో రాజన్ (ఎల్‌ఎల్‌బి) ను నియమించారు. ఏజెన్సీ ప్రాంతంలో పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతతో పాటు గిరిజన సమస్యలపై ఉన్న అవగాహనను గుర్తించిన బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఈ కీలక బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఈ నియామకంపై కిల్లో రాజన్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్‌గా అవకాశం కల్పించినందుకు పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై అధినేత ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల గ్రామాల వరకు పార్టీని విస్తరించి బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం పోరాడుతూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ నలగొండమ్మ తల్లి గిరి ప్రదక్షిణం....

- అధిక సంఖ్యలో హాజరైన భక్తజనం...
- జెండా ఊపి గిరి ప్రదక్షిణను ప్రారంభించిన ఎస్సై వై. తారకేశ్వరరావు.....



**నాతవరం,పెన్ పవర్ ( ఫిబ్రవరి 01):** మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో గల తాండవ జలాశయ దిగుభాగంలో ఉన్న శ్రీశ్రీశ్రీ నల్లగొండ అమ్మవారి గిరి ప్రదక్షిణ ను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.గిరి ప్రదక్షణలో భక్తుల సౌకర్యార్థం దాతలు మజ్జిగ,బిస్కెట్లు, డ్రింకులు,అరటి పళ్ళు,వాటర్ ప్యాకెట్లు,పుచ్చకాయ, మొక్కలు అందజేశారు.ఈ కార్యక్రమానికి నాతవరం ఎస్సై తారకేశ్వరరావు జండా ఊపి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు.భక్తులతో కలిసి సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ లో పాల్గొన్నారు.అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సేకరించారు. ఆలయ కమిటీ దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## భక్తులకు మజ్జిగ,డ్రింక్స్,వాటర్ పంపిణీ...!



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 1 :**తాండవ శ్రీశ్రీశ్రీ నల్లగొండ తల్లి గిరిప్రదర్శనభక్తులకు డ్రింక్స్, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ పంపిణీ చేసిన కొయ్యూరు వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ. ఆదివారం ఉదయం శ్రీశ్రీశ్రీ నల్లగొండ అమ్మవారి గిరి ప్రదర్శన ఉదయం అట్టహాసంగా ప్రారంభమై ఆడాకుల గ్రామం మీదగా భక్తులు కాలినడకన గిరి ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శనలో భాగంగా సుమారుగా 5 కిలోమీటర్లు భక్తులు నడవడం, మార్గమధ్యలో కొయ్యూరు వైస్ఎంపిపి అప్పన వెంకటరమణ భక్తులకు డ్రింక్స్, వాటర్ ప్యాకెట్లు ,మజ్జిగ పంపిణీ చేయడం తో భక్తులు కొయ్యూరు వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ ను అభినందించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అప్పన గజ్జయ్య దొర,గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గిరి ప్రదర్శన కొనసాగింది.

## డాక్టర్ వంపూరు గంగులయ్య పై అనుచిత వ్యాఖ్యలు తగవు

జనసేన నేతల తీవ్ర ఖండన



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 1:** పార్టీ పదవులు అనుభవిస్తూ సొంత పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం తగదని గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్, రింతాడ పంచాయతీ జనసేన పార్టీ కోశాధికారి సాగిన బ్రహ్మాజీ పడాల్ స్పష్టం చేశారు.ఆదివారం రింతాడ పంచాయతీకి చెందిన జనసేన నాయకులు ఈ విషయమై తీవ్రంగా ఖండించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు డాక్టర్ వంపూరు గంగులయ్య పై ఆధారరహిత విమర్శలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల పార్టీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని హెచ్చరించారు. పార్టీ శ్రేయస్సు కోసం అందరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు.

## డాక్టర్ వంపూరు గంగులయ్యపై తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం

జనసేన నేత కోయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు)

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 1:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ నేత డాక్టర్ వంపూరు గంగులయ్యపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన పార్టీ గూడెం కొత్త వీధి మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి కోయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు) తెలిపారు. పార్టీ ఎదుగుదలను ఓర్వలేక కొద్దిమంది కోవర్టు వ్యక్తులు జనసేన పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో, చైర్మన్ గంగులయ్యపై కల్పిత ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి గంగులయ్య చేస్తున్న కృషి, అనేక మంది నాయకులను తీర్చిదిద్దేందుకు ఆయన పడుతున్న శ్రమ ప్రజలకు, పార్టీ శ్రేణులకు బాగా తెలుసని అన్నారు.గంగులయ్య ద్వారా లబ్ది పొందిన కొందరు వ్యక్తులే నేడు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని, అందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసిన వారు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా ఎదుర్కొనే ధైర్యం లేక పరోక్షంగా కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.చైర్మన్ గంగులయ్యపై వస్తున్న ఆరోపణలు కొత్తవి కావని, గతంలోనూ ఇలాంటి ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. వాస్తవాలు జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు బాగా తెలుసని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణల ద్వారా లబ్ధి పొందాలనుకునే వారికి చివరికి నిరాశే మిగులుతుందని హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడే వారికి తగిన గుణపాఠం తప్పకుండా చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఇలాంటి కోవర్టు రాజకీయాలకు స్వస్తి పలికి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరూ ఐక్యమత్యంతో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.




# పాయకరావు బోనంగి గ్రామంలో రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా.

- పట్టపగలే గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు.
- భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి.

**పరవాడ: పెన్ పవర్; ఫిబ్రవరి 1:** ఒకపక్క అనకాపల్లి జిల్లా ఉత్సవ నిర్వహణలో ప్రభుత్వ అధికారులు నిమగ్నమై ఉంటే మరోపక్క అక్రమార్కులు అక్రమ గ్రావెల్ తరలింపులో బిజీగా ఉన్నారు. అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, పాయకరావు బోనంగి పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 19 లో ఉన్న పోరంబోకు ప్రభుత్వ భూముల్లో పట్టపగలే యథేచ్ఛగా గ్రావెల్ మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా గత రెండు రోజులుగా తరలిస్తూ లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ దందా నడిపిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. పట్టపగలే బహిరంగంగా గత రెండు రోజుల నుండి ఈ తంతు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు గాని, గనుల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో గ్రావెల్ మట్టిని తవ్వి ట్రాక్టర్ ల సహాయంతో తరలిస్తున్నారు. పరవాడ పారిశ్రామిక ప్రాంతం కావడంతో గ్రావెల్ మట్టికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీనికి తోడు పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో గ్రావెల్ మట్టికి ఎక్కడలేని డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ మట్టిని తరలించడం చట్టరీత్యా నేరం. గ్రావెల్ మట్టిని తరలించాలంటే ముందుగా రెవెన్యూ, గనుల శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. రెవెన్యూ, గనుల శాఖ అనుమతులు ఉంటేనే గ్రావెల్ మట్టిని తరలించాలి. కానీ అవేమీ పట్టని అక్రమార్కుల ఇష్టారాజ్యంగా గ్రావెల్ మట్టిని తరలిస్తూ భారీగా సొమ్ములు వెనకేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. స్థానికంగా ఉండే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి ప్రభుత్వ భూమి సమీపంలో ఏడు ఎకరాలు జరాయితి స్థలం ఉంది. ఆ భూమిని చదును చేయడానికి ప్రభుత్వ స్థలంలో ఉండే గ్రావెల్ మట్టిని ఎలాంటి అనుమతులు పొందకుండా అనాధికారికంగా తరలించారు. విలువైన గ్రావెల్ మట్టిని కాపాడవలసిన రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం వెనక ఉన్న ఆంతర్యం ఏంటో ఆ శ్రీను వాసుడికే తెలియాలి. ఇప్పటికైనా గనులు, రెవిన్యూ,పోలీస్ శాఖ అధికారులు, అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.






# డాక్ యార్డ్ ఉద్యోగులకు సంపూర్ణ సహకారం అందిస్తా

- కేటీబీ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం
- ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 1 :** డాక్ యార్డ్ ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు స్పష్టం చేశారు. ఆదివారం గోపాలపట్నంలో డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేటీబీ అసోసియేషన్ చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి కార్యవర్గ సభ్యులు గణబాబుకు వివరించారు.

సంఘం ద్వారా సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు, వన సమారాధన వంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న మెగా ఉచిత వైద్య శిబిరానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గణబాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, కాపు సామాజిక వర్గానికి చెందిన అనేక అసోసియేషన్లు భవన నిర్మాణాలపై ఆలోచించినప్పటికీ, ముందుగా డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ మాత్రమే భవన నిర్మాణాన్ని పూర్తిచేయగలిగిందని ప్రశంసించారు. సభ్యుల సంక్షేమం కోసం కేటీబీ అసోసియేషన్ చేపడుతున్న సేవలు నిజంగా అభినందనీయమన్నారు.

అలాగే తన నియోజకవర్గంలోని పద్మనాభ నగర్‌లో కాపు సంక్షేమ భవన్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, ఆ భవనాన్ని కూడా అందరం కలిసి ప్రారంభించుకుందామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగినప్పటికీ, ప్రస్తుతం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అప్పటి కాంట్రాక్టర్ నారాయణరావు నష్టపోకుండా పెండింగ్ బిల్లుల చెల్లింపులు కూడా పూర్తిచేస్తున్నట్లు గణబాబు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, బి.ఎస్. నాయుడు, రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాయి క్వారీ తవ్వకాలకు వ్యతిరేకం





**ముక్తకంఠంతో అసరాడ గ్రామస్తుల తీర్మానం**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి1:** పర్యావరణానికి, ప్రజలకు, జీవకోటికి తీవ్ర నష్టం కలిగించే రాయి క్వారీ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అసరాడ గ్రామస్తులు ముక్తకంఠంతో తెలిపారు. ఆదివారం జీకే వీధి మండలం అసరాడ గ్రామంలో రాయి క్వారీ తవ్వకాలపై గ్రామస్తుల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్, వార్డు సభ్యులు తగ్గి కాసులమ్మ, పెసా గ్రామ కమిటీ సభ్యులు కె. సింహాచలం, టి. సోమరాజు,వైసీపీ నేత బొబ్బిలి లక్ష్మణ్ (మాజీ అధ్యక్షులు), బి. వెంకటరావు (సర్పంచ్ భర్త), వైసీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కె. నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సాగిన కాంతమ్మ, కూటమి నాయకులు రంగారావు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. సమావేశంలో రోడ్డు కాంట్రాక్టర్ శ్రీనివాస్ పాల్గొని జీకే వీధి మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్లు వేసేందుకు అవసరమైన మెటల్ రాయి కోసం కోట్నపల్లిఅసరాడ గ్రామాల మధ్య ఉన్న సుమారు మూడు ఎకరాల స్థలంలో రాయి క్వారీ తవ్వకాలకు అనుమతులు తీసుకొని పనులు చేపడతామని వివరించారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు రాయి క్వారీ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, గ్రామ భవిష్యత్తుకు ముప్పుగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఇకపై గ్రామ పరిధిలో మైనింగ్ తవ్వకాలకు సంబంధించి అనుమతుల కోసం తమను సంప్రదించవద్దని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ అంశంపై వ్యతిరేక తీర్మానం చేసి పెసా గ్రామ కమిటీ సభ్యుల ద్వారా గ్రామసభలో సర్పంచ్‌కు అందజేశామని తెలిపారు. రాయి క్వారీ తవ్వకాల వల్ల గుట్టలు మాయమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మైనింగ్ తవ్వకాలకు ప్రజా ప్రతినిధులు సహకరించవద్దని గ్రామస్తులు గట్టిగా హెచ్చరించారు. మైనింగ్ వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా భవిష్యత్తులో గ్రామం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని, పశువులకు మేత కొరత ఏర్పడుతుందని, రైతులు పంట సాగు కోల్పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులందరూ ముక్తకంఠంతో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# కేజీహెచ్‌లో రాష్ట్ర తొలి 'పెయిన్ క్లినిక్' ప్రారంభం





- పూర్వ విద్యార్థుల దాతృత్వానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 01 :** రాష్ట్రంలోనే తొలి 'పెయిన్ క్లినిక్'ను విశాఖప ట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో రాష్ట్ర వై ద్యఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యా దవ్ ఆదివారం ప్రారంభించారు. దీర్ఘకాలిక నొ ప్పులు, ముఖ్యంగా క్యాన్సర్ సంబంధిత తీవ్ర మైన నొప్పులతో బాధపడుతున్న రోగులకు ఈ పెయిన్ క్లినిక్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నా రు. కేజీహెచ్‌లో పెయిన్ క్లినిక్ ఏర్పాటు కోసం ఆంధ్ర మెడికల్ కాలేజ్ నార్త్ అమెరికా అలు మ్ని అసోసియేషన్ సంస్థ రూ.కోటి విరాళం అందించడం అభినందనీయమని మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రశంసించారు. ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు ముందుకొచ్చి సేవలు అందించడం గర్వకారణ మని తెలిపారు. ఇటీవల గుంటూరులో 600 పడకల మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి పూర్వ వైద్య విద్యార్థులు అందించిన సహకారం, అలా గే విశాఖపట్నం, కాకినాడలో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి అలుమ్ని సంస్థలు చేస్తున్న సేవలను కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వాటిని దేశవ్యాప్తంగా అనుసరించదగిన ఆదర్శ మోడల్ గా ప్రశంసించినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే రోజుల్లో కీమోథెరపీ, రేడియోథెరపీ, పెయిన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి క్యాన్సర్ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను పటిష్టం చేస్తూ పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# లింగంపేటలో ఘనంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారి పండుగ.....

ఉత్సాహంగా గుర్రపు పరుగు పందాలు.....






**నాతవరం పెన్ పవర్ (ఫిబ్రవరి 01):** మండలంలో గల లింగంపేట గ్రామంలో ఆదివారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి పండగను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమ,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహాలక్ష్మి అమ్మవారి పండగను పురస్కరించుకొని కమిటీ సభ్యులు మధ్యాహ్నం ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పందాలు ఉత్సాహపరితంగా సాగేయి. గుర్రపు పందాలులో మొదటి బహుమతిగా 12 వేల రూపాయలు అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామానికి, రెండో బహుమతి పదివేల రూపాయలు చిన్ని, కోటనందూరు మండలానికి, మూడో బహుమతి రాఖీ కోటనందూరు 8 వేల రూపాయలు,నాలుగోవ బహుమతి మహాలక్ష్మి లింగంపేట 6000 రూపాయలు, ఐదో బహుమతిగా 4000 రూపాయలు షరీఫ్ వైజాగ్ గుర్రం గెలుపొందడం జరిగింది,వారికి స్థానిక ఎస్పై వై తారకేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, దేవాడ దొరబాబు,గన్నవరం ఏసీఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు, మండల తెలుగు అధ్యక్షులు పోలుపర్తి సాయి,ఎస్.బి పట్నం సత్యనారాయణ, ఎర్రవరం బెన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

- ద్రోణంరాజు శ్రీనివాసరావు 65వ జయంతి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 01 :** వీఎంఆర్‌డిఎ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు 65వ జయంతి కార్యక్రమం శనివారం విశాఖపట్నంలో ఘనంగా జరిగింది. వన్ టౌన్‌లోని స్వామి వివే కానంద సంస్థలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యనిర్వాహక అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవత్సవ ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి గారు హాజరై స్వర్గీయ ద్రోణంరాజు శ్రీనివాసరా వు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ప్రజాసేవలో ఆయన చేసిన విశేష కృషిని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. జయంతి సందర్భంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.

ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం సమ న్వయకర్త మొల్లి అప్పారావు , మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు, మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభా గాల కమిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర జిల్లా వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్య క్రమాన్ని విజయవంతం చేశారు.

# మేఘాద్రిగడ్డలో మొక్కలు నాటే కార్యక్రమం



**ప్రకృతి పర్యావరణ సేన ఆధ్వర్యంలో హరిత కార్యక్రమం**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 1 :** గ్రేటర్ విశాఖ నగరంలోని 92వ వార్డు, మేఘాద్రిగడ్డ సమీపంలో ఉన్న కొత్తమాంబ అమ్మవారి గుడి పరిసర ప్రాంతంలో ప్రకృతి పర్యావరణ సేన ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావు హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు ఆయన శ్రీ కొత్తమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మారిందని అన్నారు.

భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి వ్యక్తి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో కొటాన నరేష్, కంపర కోటేశ్వరరావు, గొంతిన నాగరాజు, కంచిపాటి మురళి, రమణ, గొద్దు నాగరాజు, మనోహర్, ఇల్లపు సురేష్, రాజు తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రకృతి పర్యావరణ సేన సభ్యులను పలువురు అభినందించారు.



ఈ సందర్భంగా స్థానికులు కూడా కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ, ఇలాంటి పర్యావరణ హిత కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

# నాయకుడితో మన కార్యకర్త కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు

* టిడిపి వార్డు నాయకులు, యూనిట్ బూత్ ఇంచార్జిలతో విస్తృత సమావేశం





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 1 :** నాయకుడితో మన కార్యకర్త కార్యక్రమంలో భాగంగా ఈరోజు విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం, గోపాలపట్నంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో టిడిపి వార్డు నాయకులు, యూనిట్ బూత్ ఇంచార్జిలతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా నాయకులు, బూత్ ఇంచార్జులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో బూత్ స్థాయి నాయకుల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా త్వరలో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ నెలలో క్లస్టర్లకు, బూత్ ఇంచార్జిలకు, కో-ఇంచార్జిలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ప్రజల సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు నాయకులను సిద్ధం చేయడం లక్ష్యమని తెలిపారు. మీ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను సంబంధిత వార్డు నాయకుల ద్వారా గానీ, నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని గణబాబు హామీ ఇచ్చారు. ప్రజలకు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## సింహాద్రి అప్పన్న సన్నిధిలో రాష్ట్ర సమాచార కమిషనర్

* భక్తి పరవశంతో స్వామివారిని దర్శించుకున్న పి.ఎస్.నాయుడు దంపతులు



**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 1 :** ఉత్తరాంధ్ర ప్రజల ఆధ్యాత్మిక ఆశలకూ, అపార భక్తిశ్రద్ధలకూ ప్రతీకగా విరాజిల్లుతున్న సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారి దివ్య సన్నిధి ఆదివారం ఉదయం భక్తి పరవశంతో నిండిపోయింది. రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్.నాయుడు సకుటుంబ సమేతంగా సింహాద్రి అప్పన్నను దర్శించుకుని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. సుజాత ఆదేశాల మేరకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ పర్యవేక్షణలో ఆలయ అధికారులు కమిషనర్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి.సత్య శ్రీనివాస్, పి.ఆర్.ఓ నాయుడు, అర్చక స్వాములు నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం అందించారు.

ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా కమిషనర్ దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసి, అనంతరం భక్తిశ్రద్ధలతో గర్భగుడిలోకి ప్రవేశించారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, దివ్య మంగళ విగ్రహ దర్శనంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. దర్శనానంతరం వేద పండితులు కమిషనర్ దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

ఈ సందర్భంగా సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వామివారి శేషవస్త్రంతో కమిషనర్‌ను ఘనంగా సత్కరించి, స్వామివారి జ్ఞాపికగా ఫోటో ప్రసాదాలు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షణాధికారి పూసపాటి సునీల్, సీనియర్ సహాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ పర్యటన సందర్భంగా గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పోలీస్ విభాగాలు భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాయి.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ భాషపై తీవ్ర విమర్శలు

**పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కార్యాలయంలో మీడియా సమావేశం**




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 1 :** గ్రేటర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం గోపాలపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు వైసీపీ నాయకత్వంపై, ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయ విమర్శల హద్దులు దాటుతున్నాయని, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు ఆదర్శంగా ఉండాల్సిన సమయంలో దిగజారిన భాష వాడటం రాష్ట్ర రాజకీయ సంస్కృతికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యలు చేశారు.

రాజకీయ విమర్శల స్థాయి దిగజారుతోందా?

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ నేతలు వాడుతున్న భాషను గణబాబు తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ వేదికకే పరిమితం కాకుండా రోడ్ల మీద కూడా అదే రకమైన దూషణాత్మక పదజాలం వినిపించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ విభేదాలు ఉన్నా, వ్యక్తిగత దూషణలకు దిగజారడం ప్రజల్లో తప్పు సంకేతాలను పంపుతుందన్నారు.

తిరుమల లడ్డు అంశం దర్యాప్తుపై రాజకీయాలు..?

తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ అంశంపై వచ్చిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిగిందని, ఆ నివేదిక ఏమి చెప్పిందో వైసీపీ నేతలు తెలుసుకోవాలని గణబాబు అన్నారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకోవడం సరికాదని ఆయన వ్యాఖ్యలు చేశాయి. ఈ విషయంలో సిట్ నివేదికపై చర్చ జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి పై నేరుగా దూషణలకు దిగడం అనవసర ఉద్రిక్తతలకు దారి తీస్తుందని చెప్పారు.

'డైరెక్షన్ పాలిటిక్స్'నా..?

వైసీపీ నేతల ప్రవర్తన పార్టీ అధినాయకత్వాన్ని మెప్పించేందుకేనా అన్న సందేహాన్ని గణబాబు వ్యక్తం చేశారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాల్లో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని, కానీ దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

విశాఖలో హింసాత్మక రాజకీయాలు..?

ఇటీవల విశాఖలో కౌన్సిల్ సమావేశంలో మేయర్‌పై జరిగిన దాడిని ప్రస్తావించిన గణబాబు, ఇది నగర రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేని పరిణామమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కూడా అధికారులపై దాడులు జరిగాయని గుర్తు చేస్తూ, ఇది ఒక రకమైన రౌడీ రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు.

రెండు రాజకీయ శైలుల తేడా..

కూటమి ప్రభుత్వం హుందాగా రాజకీయాలు చేస్తున్నదని, సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమాలే తమ నాయకుల జన్మదిన వేడుకల్లో కనిపిస్తున్నాయని గణబాబు తెలిపారు. దీనికి భిన్నంగా, వైసీపీ నేతలు హింసాత్మక సంకేతాలు ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

చట్టపరమైన నియంత్రణ అవసరం..

ఇలాంటి దూషణాత్మక భాషను అరికట్టేందుకు భవిష్యత్తులో కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని గణబాబు స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాట సమాజంపై ప్రభావం చూపుతుందని, కాబట్టి బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. మొత్తంగా, గణబాబు మీడియా సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో భాషా సంస్కృతి, హింసాత్మక రాజకీయాలు, భక్తుల మనోభావాల వంటి అంశాలపై కొత్త చర్చకు తెరలేపింది. ఇది కేవలం రాజకీయ విమర్శగా కాకుండా, భవిష్యత్తు రాజకీయ ప్రవర్తనపై హెచ్చరికగా కూడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# క్యాన్సర్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు







* ప్రాథమిక దశలోనే గుర్తింపు ఉచిత స్క్రీనింగ్‌తో బాధితులకు రక్షణ
* విశాఖ వాక్ థాన్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్ భావోద్వేగ ప్రసంగం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 01 :**క్యాన్సర్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రాణా లు కాపాడడమే లక్ష్యంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం ఉదయం మహా త్మాగాంధీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వాక్ థాన్' అవగా హన కార్యక్రమంలో మంత్రి పాల్గొని భావోద్వేగ ప్రసంగం చేశారు. క్యాన్సర్ కారణంగా తన తల్లి, సోదరిని కోల్పోయిన వేదనను గుర్తు చేసుకుం టూ, "ఈ వ్యాధి ప్రభావం నన్ను తీవ్రంగా కలచి వేసింది. అందుకే మంత్రిగా బాధ్యతలు స్వీకరిం చిన వెంటనే తొలి సంతకం క్యాన్సర్ స్క్రీనింగ్ ఫైలుపై పెట్టాను" అని చెప్పారు.క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్సీడీ04 (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) కార్యక్రమం కింద ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ఉచితంగా నిర్వహిస్తున్నామని వివరించారు.

రాష్ట్రంలో ఆందోళనకరంగా క్యా న్సర్ కేసుల పెరుగుదల

రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు జాతీయ సగటుతో పోలిస్తే వేగంగా పెరుగుతున్నాయని మంత్రి ఆం దోళన వ్యక్తం చేశారు. 2020లో 25,487 కేసు లు నమోదుకాగా, 2025 నాటికి అవి 35,54 6కు చేరి 39.5 శాతం పెరిగాయని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ పెరుగుదల కేవలం 12.8 శాతమేనని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 18 శాతం మంది క్యాన్సర్ కారణంగా మరణిస్తున్నారని, ఈ జాబితాలో భారత్ మూ డో స్థానంలో ఉందని పేర్కొన్నారు.

ఉచిత స్క్రీనింగ్‌తో వేలాది మందికి లబ్ధి ఇప్పటివరకు రాష్ట్రంలో 1,39,07,523 మందికి ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించగా, అవసరమని గుర్తించిన 3,41, 179 మందికి దశలవారీ పరీక్షలు చేపట్టామని తెలిపారు. వీటిలో 98 కేసులు నిర్ధారణ అయ్యా యని చెప్పారు.బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలను 73,78, 836 మంది మహిళలకు చేయగా, తదుపరి పరీక్షలు అవసరమైన 1,65,022 మందిలో ఇప్పటివరకు 104 కేసులు బయటపడ్డాయని తెలిపారు. అలాగే సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనిం గ్‌లో 58 కేసులు గుర్తించామని వివరించారు. ఈ విధంగా ముందస్తు గుర్తింపుతో బాధితులు త్వరగా చికిత్స పొంది క్యాన్సర్ నుంచి బయట పడే అవకాశం ఉంటుందని మంత్రి చెప్పారు.

పరీక్షలకు సంకోచం వద్దు

స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడంలో ప్రజలు సంకోచించవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు వచ్చే వైద్య సిబ్బందికి సహకరించాలని, భయప డాల్సిన అవసరం లేదని చెప్పారు. క్యాన్సర్ మూడో, నాలుగో దశలకు చేరితే చికిత్స క్లిష్టమ వుతుందని, అందుకే ముందస్తు పరీక్షలు అత్యం త అవసరమని స్పష్టం చేశారు.

18 వేల మందికి శిక్షణ

క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్సలను మరింత సమ ర్థవంతంగా అమలు చేసేందుకు హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో 18 వేల మం ది వైద్య సిబ్బంది, 550 మంది వైద్య నిపుణు లకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు మంత్రి తెలిపారు.

పేదలకు చేరువైన ఉచిత క్యాన్సర్ చికిత్స

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా క్యాన్సర్ బాధి తులకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.600 కోట్ల మేర ఉచిత చికిత్స అందిస్తోందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 17 టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రివెంటివ్ ఆంకాలజీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు. అలాగే సెకండరీ ఆసుపత్రుల్లో డే కేర్ కీమోథెరపీ సెంటర్లను విస్తరిస్తున్నామని చెప్పారు.గుంటూరు జీజీహెచ్‌లో లెవల్1 క్యాన్సర్ కేర్ సెంటర్, కర్నూలు జీజీహెచ్‌లో రూ.120 కోట్లతో రాష్ట్ర స్థాయి క్యాన్సర్ సెంటర్, కడప క్యాన్సర్ సెంటర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విశాఖ కేజీహెచ్‌లో పీఈటీ స్కాన్ సౌకర్యం కల్పించా లన్న డిమాండ్‌ను పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

'గుడ్ మార్నింగ్ వైజాగ్ గుడ్ బై క్యాన్సర్'

వాక్ థాన్ కార్యక్రమానికి హాజరైన వేలాది మందితో కలిసి మంత్ర సత్యకుమార్ యాదవ్ "గుడ్ మార్నింగ్ వైజాగ్ గుడ్ బై క్యాన్సర్" అంటూ నినాదాలు చేయించారు. క్యాన్సర్‌పై పోరాటంలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మార్గమని ఆయన పిలుపునిచ్చారు.

# సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో 'శ్రీ చిదంబరం' చిత్ర బృందం



**విడుదలకు ముందు ఆధ్యాత్మిక ప్రారంభం**

**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 1 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం సింహాచలంలో ఆదివారం ఓ ప్రత్యేక సందడి నెలకొంది. ప్రతిభావంతుడైన యువ దర్శకుడు వినయ్ రత్నం దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం 'శ్రీ చిదంబరం' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర బృందం సింహాద్రి అప్పన్నను దర్శించి దైవ ఆశీస్సులు పొందింది. ఈ సందర్భంగా హీరో వంశీ తుమ్మల, కథానాయిక సంధ్య వశిష్ట, దర్శకుడు వినయ్ రత్నం కలిసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం దేవస్థాన అర్చకులు చిత్ర బృందానికి వేద ఆశీర్వచనం అందజేసి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు. దర్శనం అనంతరం చిత్ర బృందం మీడియాతో మాట్లాడుతూ, సినిమా విడుదలకు ముందు సింహాద్రి అప్పన్న ఆశీస్సులు తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అప్పన్న దయతో తమ చిత్రం తప్పకుండా ఘన విజయం సాధిస్తుందనే పూర్తి నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. వంశీ తుమ్మల కథానాయకుడిగా, సంధ్య వశిష్ట కథానాయికగా నటించిన 'శ్రీ చిదంబరం' చిత్రాన్ని ఓ సంపూర్ణ ఫీల్ గుడ్ ఎంటర్టైనర్గా రూపొందించినట్లు దర్శకుడు వినయ్ రత్నం తెలిపారు.

కుటుంబ సమేతంగా చూసేందుకు అనువైన వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, పాటలు, ప్రచార వీడియోలకు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కథ, సంగీతం, విజువల్స్ పరంగా ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వినయ్ రత్నం మాట్లాడుతూ,

"కథపై ఉన్న నమ్మకంతో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్న 'శ్రీ చిదంబరం' సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది," అని అన్నారు. 'శ్రీ చిదంబరం' చిత్రం ఫిబ్రవరి 6న తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఘనంగా విడుదల కానుండగా, ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ చేసింది. సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కూడా విజయవంతం కావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# మల్కాపురంలో ఘనంగా డా. బీ.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ





- ఉపాలీ బుద్ధ విహార్‌లో ఆదివారం సాయంత్రం వేడుకలు
- విగ్రహ దాత సి. రాంజీకి సత్కారం

**ములగాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 01** :భారత రాజ్యాంగ నిర్మాత డా. బీ.ఆర్. అంబే డ్కర్ కాంస్య విగ్రహాన్ని మల్కాపురంలో ఘ నంగా ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం మల్కాపురంలోని ఉపాలీ బుద్ధ విహార్ ప్రాంగ ణంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా సాగింది. ఈ కాంస్య విగ్రహాన్ని సి. రాంజీ గారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేశారు. బుద్ధ విహార కమిటీ సభ్యులు కె. ప్రజ్ఞ కార్యక్రమానికి హాజరైన అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం బోరా వేణుగోపాల్ గౌత మ్ బుద్ధ వందన నిర్వహించగా, సి. రాంజీ మరియు డా. సీ. ప్రజ్ఞ కలిసి డా. బాబాసాహెబ్ అంబేద్కర్ బస్ట్ సైజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత సి. రాంజీ గారిని ఉపాలీ బుద్ధ విహార్ కార్యవర్గ సభ్యులు మెమెంటోతో ఘనంగా సత్కరించారు. డా. అం బేద్కర్ ఆశయాలను స్మరిస్తూ, సమాన త్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డా. రాజేంద్ర ప్రసాద్, సత్య శీలా, ఆనందరావు, ఉదయ్ కుమార్, భీమ్, కమల, సాయి చందు, అన్నవరం, సింహాద్రి, ఉల్లి రమణ, సునీత, వెంకట లక్ష్మీ, సుమేధ, సమత, రావి తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వైయస్సార్ పార్టీ గ్రామస్థాయి కమిటీలు

- జడ్పీటిసి పోతురాజు బాలయ్య



**చింతపల్లి పెన్ పవర్ ఫిబ్రవరి 1:-** ఆంధ్ర కాశ్మీర్ లమ్మసింగి పంచాయతీ లో సుడిగాలి పర్యటన చేసిన జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ఈసందర్భంగా ఆయన నాయకులు, కార్యకర్తల తో మాట్లాడుతూ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మరియు జిల్లా పార్టీ అధ్యక్షులు స్థానిక శాసనసభ్యులు మత్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు పార్టీ గ్రామ స్థాయి పార్టీ సంస్థాగత కమిటీలు ఏర్పాటు తొందరగా పూర్తి చేయాలని కోరారు. కమిటీలు ఏర్పాటు రెండో తేదీ లోగా పూర్తి చేసి జిల్లా పార్టీ కార్యాలయానికి అందజేయవలసిన అవసరం ఉందని తెలిపారు. కావున ఆయా పంచాయతీ బాధ్యులు కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఒక ప్రకటనలో కోరారు. లమ్మసింగి పంచాయతీ లో పార్టీ సంస్థాగత కమిటీలు ఏర్పాటు పూర్తి చేసి ప్రతులను జెడ్పీటీసీ కి అందజేసిన లమ్మసింగి పంచాయతీ పార్టీ నాయకులు కొర్రా రఘునాథ్, దేపూరి గిరిబాబు, రావుల నూకరాజు సరమండ వెంకటనాగరాజు గండేపల్లి వెంకటరమణ. ఈకార్యక్రమంలో బలపం సర్పంచ్ కొర్రా రమేష్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మోరి రవి యువనాయకుడు చంటిబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన నేతల చొరవతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు.



జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, ఉగ్రంగి లక్ష్మణ్ రావు



**చింతపల్లి పెన్ పవర్ ఫిబ్రవరి 1:-** చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కప్పల గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలకు జనసేన పార్టీ నాయకుల చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాత విద్యుత్ స్తంభాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్తులు జనసేన విశాఖ రూరల్ ప్రధాన కార్యదర్శి ఉల్లి సీతారాం, సీనియర్ నాయకులు ఉగ్రంగి లక్ష్మణ్ రావుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన నాయకులు చింతపల్లి విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఏఈ (ఏఈ) కి వినతిపత్రం అందజేశారు. జనసేన నేతల విజ్ఞప్తి పై సానుకూలంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. లైన్ మెన్ డి. రాజబాబు సమర్థవంతంగా పర్యవేక్షించి, గ్రామంలో 12 నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించారు. తమ సమస్యను వారం రోజుల వ్యవధిలోనే పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ జనసేన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఉగ్రంగి లక్ష్మణ్ రావు, ఆర్. వినోద్, మాతే వర్మ (పండు), పేసా ఉపాధ్యక్షుడు లోచల రామారావు, వార్డ్ మెంబర్ లోచల రాజారావు, గేదెల రాజారావు, ఉల్లి చిట్టిబాబు, లోచల రమేష్ నాయుడు, మాజీ వైస్ ప్రెసిడెంట్ లోచల వెంకట రావు, వనము చంటిబాబు, బోనంగి బాబురావు, సత్య కొండం నాయుడు, వి. ప్రసాద్, బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీసభ్యత్వ నమోదు కార్యక్రమం



**చింతపల్లి పెన్ పవర్ ఫిబ్రవరి 1:-** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యత్వ నమోదు కార్యక్రమం. చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత అధ్యక్షతన కందుల గది మల్లవరంగ్రామాలలో. ఏర్పాటు చేయడం జరిగింది. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందనిఈ సమావేశంలో సర్పంచ్ తెలిపారు మాజీముఖ్యమంత్రివర్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు. వివిధ విభాగాలలోపార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కుటుంబ సభ్యులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని. 2029 లో వచ్చేది వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే కార్యకర్తలతోనే ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుకోరే విధంగా ఈ కమిటీ పని చేస్తుందని ఈ కమిటీకి ప్రత్యేకమైనటువంటి గుర్తింపు ఉంటుందని చెప్పడం జరిగింది. ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకున్న జగన్మోహన్ రెడ్డి వెనుక నడవడానికి గ్రామస్థాయి నుండి కార్యకర్తలు నాయకులు కమిటీలు ఏర్పాటు అటువంటి అందరు కూడా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారుఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు . రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి. జల్లి సుధాకర్. రైతు విభాగం కార్యదర్శి భూసరి కృష్ణారావు. రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి. సాగిన గంగన్న పడాల్. మాజీ మండల పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు మోరీ రవి. వార్డ్ సభ్యుడు చిట్టి బాబు, రెహ్మాన్ .సీనియర్ నాయకులు పరమేష్ నీలేసు. లోవ రాజు. సోమలింగం. శోభన్ బాబు. చిన్నారావ్. దాసు. మత్యరాజు, రామకృష్ణ గ్రామ పెద్దలు మరియు యూత్ నాయకులు అత్యధికంగా పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ పలు విభాగాల ఉద్యోగులకు ఉన్నత పదవులు

- సిబ్బందిని అభినందించి ఉన్నత పదవుల పత్రాలు అందజేసిన
- విశాఖ రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు





**విశాఖ తూర్పు, పెన్ పవర్, ఫిబ్రవరి 1**:విశాఖపట్నం రీజియన్ ఏపీఎస్ఆర్టీసీలో సిబ్బంది ఉన్నతి పదవులకు మేనేజింగ్ డైరెక్టర్ ఏపీఎస్ ఆర్టీసీ ఆదేశాల మేరకు ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు వివిధ కేటగిరీలలో సుమారు 300 సిబ్బందికి ప్రమోషన్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలు విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు జిల్లా రీజియన్ క్యాటగిరి ఏపీఎస్ఆర్టీసీ సిబ్బందికి ప్రమోషన్లు చేసి ఉన్నారు. అందులో లీడింగ్ హాండ్స్ పెయింటర్స్ ,వెల్డర్స్ , టెక్నికల్ ఎడిసిలకు సుమారు 30 మందికి ప్రమోషన్ ఇచ్చి ఉన్నారు. మిగిలి ఉన్న క్యాడర్ క్యాటగిరిలో సోమవారం ఉత్తర్వులు జారీచేయునట్లు ఆయన తెలిపారు. . అధికారులు, సూపర్వైజర్లు సిబ్బంది రికార్డులు తనిఖీ చేసి ప్రమోషన్ ఇచ్చేందుకు సిద్ధం చేసినట్లు, విశాఖ జిల్లాలో జాబితాను సిద్ధం చేససారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రమోషన్ సిబ్బందీని విశాఖ జిల్లా రీజినల్ మేనేజర్ బి అప్పలనాయుడు వారిని ఆయన చాంబర్లో అభినందించారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె. పద్మావతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఏ. గంగాధర్, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ పెర్సనల్ జి. శ్రీధర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాఘ పౌర్ణమి పర్వదినం





- గాణగాపూర్‌లో భీమా,అమర్జా సంగమంలో
- సిరమ్మ కుటుంబ సభ్యులతో పుణ్యస్నానం

**బిమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 01** :మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ దత్తాత్రేయ క్షేత్రమైన గాణగాపూర్‌లో భీ మా అమర్జా నదుల సంగమ ప్రదేశంలో సిరమ్మ కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యస్నానం ఆచ రించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, భీ మిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీని వాసరావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జ ర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ఈ పుణ్యకార్యంలో పాల్గొన్నారు. ఆమెతో పాటు ఆమె భర్త ప్రదీప్ నాయుడు, అత్త పద్మ , తల్లి మజ్జి పుష్పాంజలి , అత్తలు శ్రీమతి అమృతవల్లి, రమ పుణ్యస్నా నం చేసి దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నా రు.

ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భీమాఅమర్జా సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మా ఘ పౌర్ణమి సందర్భంగా గాణగాపూర్ దత్తక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

# అరకు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట.

- 200 ఎకరాల్లో 'అరకు ఆర్ట్ విలేజ్' ఏర్పాటు
- త్వరలో ఉత్తరాంధ్రలో 'డోలి' రహిత గ్రామాలులి
- 500 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రోడ్ల కనెక్టివిటీ
- ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాటికి 'ఆర్ట్ విలేజ్'
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి.




**అరకులోయ పెన్ పవర్1:** గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి మరియు స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అరకు ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అరకు ఫైనరీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అరకు సంస్కృతిని, కళలను ప్రపంచవ్యాప్తం చేసేందుకు అరకు మండలం చొంపి గ్రామంలో 200 ఎకరాల్లో 'అరకు ఆర్ట్ విలేజ్' ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ప్రముఖ ఆర్కిటెక్ట్‌ల సలహాలతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టును, ఈ ఏడాది ఆగస్టు 9న 'ప్రపంచ ఆదివాసి దినోత్సవం' సందర్భంగా ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కవులు, కళాకారులకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలోని ఏడు ఏజెన్సీ నియోజకవర్గాల్లో ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించి డోలి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 500 కోట్ల రూపాయలతో గ్రామాలకు రోడ్ల అనుసంధాన కార్యక్రమం చేపడుతున్నామని, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అరకు కాఫీకి సాటిగా స్థానిక చిరుధాన్యాలతో తయారు చేసిన 'అరకు కౌన్' 'అరకు తాలి'లను పర్యాటకులకు పరిచయం చేస్తామన్నారు. పర్యాటక రంగం ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు క్యారవాన్ టూరిజం, హోమ్ స్టే టూరిజం, అడ్వెంచర్ పార్కులు మరియు రిసార్టులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగిన అరకు ఉత్సవాలు అత్యంత విజయవంతమయ్యాయని తెలిపారు. ఎనిమిది రాష్ట్రాల గిరిజన కళాకారుల ప్రదర్శనలు, అరకు కార్నివాల్, మ్యూజికల్ నైట్స్, హెలీ టూరిజం మరియు గాలికొండ ట్రెక్కింగ్ వంటి కార్యక్రమాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టీ20 ప్రపంచ కప్‌నకు దూరం.. బంగ్లాదేశ్‌లో కొత్త టోర్నమెంట్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026 (T20 World Cup)కు దూరమైన బంగ్లాదేశ్ తమ దేశ ఆటగాళ్ల కోసం కొత్త టీ20 టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దీనికి ఓడోమ్మో బంగ్లాదేశ్ ౨20 కప్ 2026 (ODOMMO Bangladesh T20 Cup) అని పేరు పెట్టింది. 'ఓడోమ్మో' అంటే బంగ్లాలో అజేయమైన లేదా ఎవరికీ లొంగనిది అని అర్థం. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. మూడు జట్లు పోటీపడతాయి. ధూమ్‌కేతు శ× జట్టుకు లిటన్ దాస్, దర్బార్ XI టీమ్‌కు నజ్ముల్ హుస్సేన్ శాంటో, దురంటో శ× జట్టుకు అక్బర్ అలీ నాయకత్వం వహించనున్నారు. ప్రైజ్‌మనీ, ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులకు రూ.1.87 కోట్లు ఖర్చు చేస్తామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి తెలిపారు. మ్యాచ్‌లకు మరింత ఊపు తీసుకొచ్చేందుకు 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్'ను ఈ టోర్నీలో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 9న ఫైనల్ నిర్వహిస్తారు. టీ20 ప్రపంచ కప్ 2026 ఈ నెల 7 నుంచి ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. దీంతో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రత్యామ్నాయ జట్టుగా ఆడించాలని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కొత్త టోర్నమెంట్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా అల్కరాస్..



**హైదరాబాద్ పెన్ పవర్:** పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతిపిన్నవయస్కుడిగా ప్రపంచ నంబర్ వన్ అల్కరాస్ (స్పెయిన్) చరిత్ర సృష్టించాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో అల్కరాస్ విజయం సాధించాడు. 22 ఏళ్ల అల్కరాస్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇది తొలి టైటిల్. అతను ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025) టైటిళ్లు సాధించాడు. మరోవైపు.. జకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో ఇది తొలి ఓటమి. అంతకుముందు ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. టెన్నిస్ చరిత్రలో అత్యధిక (25) గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించాలనుకున్న జకోవిచ్ ఆశలపై అల్కరాస్ నీళ్లుచల్లాడు. ప్రస్తుతం 24 టైటిళ్లతో ఉన్న నొవాక్.. 25వ టైటిల్ కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యూఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్‌స్లామ్ కొట్టలేకపోతున్నాడు.

# అండర్19 వరల్డ్ కప్: పాక్‌తో ఇండియా ఢీ

## సెమీఫైనల్ బెర్తుపై టీమిండియా గురి

## మధ్యాహ్నం1 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో




**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్19 వరల్డ్ కప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న యంగ్ ఇండియా.. హై ఓల్టేజ్ పోరుకు రెడీ అయింది. ఆదివారం జరిగే సూపర్6 ఆఖరి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇందులో గెలిచి సెమీఫైనల్‌కు చేరుకోవడంతో పాటు ఆసియా కప్ ఫైనల్లో పాక్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని కుర్రాళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వరల్డ్ కప్‌లో ఇండియా కుర్రాళ్ల ఆధిపత్యమే ఎక్కువగా కనిపించింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, అమెరికాపై గెలిచారు. సూపర్6 తొలి మ్యాచ్‌లోనూ జింబాబ్వేను ఓడించి మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. దాంతో పాక్‌తో మ్యాచ్‌లోనూ టీమిండియానే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వైభవ్ సూర్యవంశీ (166 రన్స్), అభిగ్యాన్ కుండు (183), విహాన్ మల్హోత్రా (151) ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. వీళ్లకు తోడు కెప్టెన్ ఆయుష్ మాత్రే, ఆరోన్ జార్జ్ బ్యాట్ ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయం. బౌలింగ్‌లో పేసర్ హెనిల్ పటేల్, ఉదవ్ మోహన్, ఆర్.ఎస్ అంబరీష్‌పైనే ఎక్కువగా భారం ఉంది. వీళ్లందరూ సమష్టిగా చెలరేగితే ఇండియా విజయాన్ని అడ్డుకోవడం కష్టమే. మరోవైపు పాకిస్తాన్‌ను కూడా తక్కువగా అంచనా వేయలేం. సూపర్6 తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై గెలిచి మంచి జోరు మీదుంది. ఆసియా కప్ ఫైనల్లో 172 రన్స్ చేసిన ఓపెనర్ సమీర్ మిన్హాస్ మంచి ఫామ్‌లో ఉండటం పాక్‌కు కలిసొచ్చే అంశం.

# ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆ ముగ్గురు



**సిట్రస్ & రోజెస్ రిట్రీట్: మిషా నారంగ్ ట్రాంక్విల్ మూమెంట్**



అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, చిరంజీవి వంటి దిగ్గజాలు కేవలం వెండితెరపైనే కాదు.. నిజ జీవితంలో కూడా తమ సింప్లిసిటీతో కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.
సూపర్ స్టార్ రజనీకాంత్ సింప్లిసిటీ వెనుక రహస్యం పరిశీలిస్తే.., రజనీకాంత్ హిమాలయాల యాత్రలు, మహావతార్ బాబాజీ బోధనలు వినేందుకు ఇష్టపడతారు. ఆయనకు షూటింగ్ లేకపోతే కేవలం సాధారణ పంచె, లుంగీలోనే కనిపిస్తారు. బిగ్ బి అమితాబ్ బచ్చన్ తన తండ్రి హరివంశ్ రాయ్ బచ్చన్ నుంచి సాహిత్యం, క్రమశిక్షణ అవవరుచుకున్నారు. ఈ వయసులో కూడా ఆయన సెట్స్‌లో అందరికంటే ముందు ఉండి అందరినీ గౌరవిస్తారు. అంతేకాదు యువకుల కంటే ఎక్కువ ఉత్సాహంగా ఈ వయసులోను నటిస్తున్నారు.మెగాస్టార్ చిరంజీవి మొదటి నుంచి హనుమంతుడి భక్తుడు. సామాన్య కుటుంబం నుండి గ్లామర్ ప్రపంచంలోకి వచ్చి మెగాస్టార్‌గా ఎదిగేందుకు ఎంతో శ్రమించారు. ఒదిగి ఉండే స్వభావం ఆయన ప్రత్యేకత. పై ముగ్గురూ కొత్త వారితో కూడా ఎంతో ఆప్యాయంగా మాట్లాడే నైజం ఉన్నవారు. లగ్జరీ కంటే సాధారణ ఆధ్యాత్మిక జీవితం గడిపేందుకు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటారు.

**అహంకారం వీడితేనే అసలైన సుఖం**

నిజానికి ఏ మనిషి అయినా అహంకారం వీడితేనే సుఖం. ఎంత సింపుల్‌గా జీవిస్తే అంత మేలు! అనేది అక్షర సత్యం. ఈ స్టార్లందరూ తమలోని -అహాన్ని- పక్కన పెట్టారు కాబట్టే వేల కోట్ల ఆస్తి ఉన్నా సామాన్యుడిలా జీవించేందుకు వెనకాడరు. ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలు చేయడం మాత్రమే కాదు.. ఎదుటి మనిషిని గౌరవించడం తన మూలాలను మర్చిపోకపోవడం అని వీరు నిరూపిస్తున్నారు.
సూపర్ స్టార్ రజనీకాంత్ సింప్లిసిటీ గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అరవింద్ స్వామి చెప్పిన ఈ సంఘటన ఎంతో ఆశ్చర్యం కలిగించింది. తళపతి (1991) షూటింగ్ సమయంలో సెట్లో ఒక బెడ్ పై అరవింద్ స్వామి ఆదమరిచి నిద్ర పోయారు. అయితే అది రజనీకి కేటాయించిన బెడ్ అనే విషయం అతడికి తెలియదట. అయితే ఆ సమయంలో అక్కడికి వచ్చిన రజనీకాంత్ ఆ దృశ్యం చూసారు. అయితే అతడిని నిద్రలేపి డిస్టర్బ్ చేయలేదు. ఎవరో కొత్త కుర్రాడు.. పాపం అలసిపోయి నిదురపోతున్నాడు.. అని తను చాప తీసుకుని నేలపైనే నిదురించారట. అయితే కాసేపటికి నిదుర లేచి చూశాక అరవింద స్వామి షాక్ అయ్యారట. ఈ విషయాన్ని ఇప్పుడు అతడు గుర్తుచేసుకున్నారు.



**మాళవిక మోహనన్ జ్యువెల్ గ్లో: గుడ్ హెయిర్ డే వైబ్స్**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965